



ముళ్ళపూడి వెంకటరమణ

మర్నాడు సుబ్బరాజు రాగానే రామిరెడ్డి గారు కథవంటి కథ చెబుతా విను అని ఆరంభించాడు.

అనగనగా రెండు రాజ్యాలు. ఒక దాని పేరు శబ్దరాజ్యం. రెండోది నిశ్శబ్ద రాజ్యం.దీనికి ఆరాజ్యం వారీ పేరుపెడితే, దానికి ఈ దేశం వారు ఆ పేరు పెట్టారు. అసాధ్యపువిషయం అందిస్తా నని ఆశపెట్టి, అందినట్టే నమ్మించి, దానిచుట్టూరా కవిత్వంపైత్యం అల్లి, ఊహాలాసౌదచేస్తారని, అందువల్ల అది శబ్దరాజ్యమని వాదం. మీదేశంలో గప్ చిప్‌గా ఉంటారు గాబట్టి మీది నిశ్శబ్ద రాజ్యం అన్నారువీరు. మీది ఒకటేపార్టీ. రెండో అభిప్రాయంలేదు అని ఎత్తిపొడి చారు. మీదీ అంతే. అభిప్రాయం ఒకటే గాబట్టి పార్టీలు రెండైనా ఒకటే కిందే లెక్క. మళ్ళీ మూడోది రాకుండా కట్టు దిట్టంచేసి ఇంకోదాని కసలు ఆస్కారం లేనట్టు అభినయిస్తారు. మీవి రెండు పార్టీలయినా వాటి తాత్పర్యం ఒకటే. కాళ్ళాగజ్జా కంకాళమ్మా వేగుచుక్కా


వెలగా మొగ్గా మొగ్గాకాదూ నూటికి నీరూ నీరూకాదూ నిమ్మలవాయా...ఆట అడి ఏది మంచిదో తేల్చుకోవచ్చుఅంటూ ఇవ తలివాళ్ళు దెప్పిపొడిచారు.

ఒకటిమాత్రం రైటే. ఆ రెండు పార్టీల్లో పేర్లను తప్పిస్తే పెద్దతేడా ఉండదు. ఒకపార్టీలో రెండు గ్రూపు ల్లాటివవి. ఒకటి 'క' మరొకటి 'ఖ.' రెండింటా దుర్మార్గులూ, సన్మార్గులూ కూడా ఉన్నారు.

ఒకసారి ఒక వాడలో ఎన్నికలు వచ్చాయి. క, ఖ పార్టీల టికెట్లుకొని ప్లాటుఫారం ఎక్కిన అభ్యర్థులు ఎవరికీ ఎవరూ ఎందునా తీసిపోనివారే. ఇద్దరూ ఆఫీసులో కుర్రాళ్ళుగా జీవితం ఆరంభించి కంపెనీల డైరెక్టర్లుగా వృద్ధికివచ్చి రాజకీయాల్లోకి దిగజారి పోయారు. పంచవర్ష ప్రణాళికలు వేసు కుని వంతుల ప్రకారం వోసారి వీరూ, వోసారి వారూ అన్నట్టు పదవి కెగిరి ఉట్టికొడుతూ తొలి ప్రణాళికలో వ్యావ సాయకాభివృద్ధి, రెండదానిలో పారి శ్రామికాభివృద్ధి, మూడవదానిలో వర్తక వాణిజ్యాభివృద్ధి, నాలుగవదానిలో అధి కారసామ్రాజ్యాభివృద్ధి సాధించుకున్నారు —సొంతానికి.

ఎక్కువ డబ్బు గడించారన్న నెపంతో పన్నులభారం కొద్దిమంది నెత్తిన వెయ్యడం భావ్యంకాదని వాదించి, ఉత్తరోత్తరా తమ మునిమన వలు గడించే దానిమీదకూడా అట్టేపన్ను పడకుండా కట్టుదిట్టమైన చట్టాలు తెచ్చారు. సామాన్య పౌరులుగా, వర్త కులుగా ఉన్నకాలంలో నూరింట యాభై పాళ్ళు ఆపైగా రాజాగారి ఖజానాకిస్తే, ఇప్పుడు చట్టాలకు చుట్టుతిరిగి దోబూచు లాడించడంద్వారా నూటికి ఐదువంతుల పన్నుతో సరిపెట్టడం మరిగారు. ఊరందరికీ మప్పారు. ఆవిధంగా వారిద్ద రికీ ఆ వాడలో చాలామంది ఎంతో ఋణపడి ఉన్నారు. 'దొంగాట' ఆడ డంలో ఒడుపులు తెలియడమే ప్రజా స్వామ్యంలో తాత్పర్యం అన్న ధర్మాన్ని ప్రతిష్ఠించారు. అందువల్ల తప్పుచెయ్యడం తప్పుకాదనీ, దొరికిపోవడమే తప్పనీ, చేతగానివాడు ఆటలోఉంటే ఆట చెడు తుంది కాబట్టి వాణ్ణి ఖైదులో దాచేసి ఆటచూస్తూ కొత్తఒడుపులు ఆలోచించు కుందుకు సావకాశం కలిగించాలనీ, ఇలా అందరికీ సమానావకాశాలు కలి గించడమే ఈ వ్యవస్థలో గొప్పదనమనీ శాస్త్రం ఏర్పరచారు.దాన్ని చట్టాలమీదకు వ్యాఖ్యానాలుగా రూపొందించి చక్కగా విషయం ప్రస్తరించారు.

ఈ విద్యలో దీని ప్రయోగంలో ఆ ఎన్నికకు నిల్చిన అభ్యర్థులిద్దరూ ఘనులే. అందువల్ల ఎవరికి ఓటు చెయ్యాలీ అన్నది అక్కడి ప్రజలు ఓ పట్టాన తేల్చుకోలేకపోయారు. లాటరీలు వేసుకునీ, కండచీమలచేత ఏదో ఒక




చీటీ ముట్టించీ, కాళ్ళాగజ్జా కంకాళమ్మా ఆడీ, రెమ్మలు పట్టుకుని "ఐలైక్‌యూ. ఐలైక్‌యూనాట్" అంటూ ఒక్కొక్క ఆకే తుంచేసే దొరల పద్ధతిమీదా ఎవరికి ఓటు వెయ్యాలీ, ఫలానవాడికి వెయ్యాలా కూడదా అనే మహా సమస్యను పరిష్కరించుకోసాగారు. ఈ లాటరీ పద్ధతిమీద నమ్మకంలేక సొంతంగా ఆలోచించాలని సరదాపడ్డ జనులు తమచేత 'ఆలోచింపజేయడానికి' సైకాలజిస్టులు—అంటే మన స్తత్వం గ్రహించి మన మనసులోమాట ఏమిటని తమ మనసులో తోచిందే చెప్పి ఒప్పించే ఇంద్రజాలకులన్నమాట— వాళ్ళదగ్గర కెళ్ళారు. మళ్ళీ పాపం ఆ ఖర్చు మీరేం పెట్టుకుంటారని, ఎన్నికల అభ్యర్థులే సొంత ఖర్చుమీద వీధివీధినా సైకాలజిస్టు షాపులు తెరిపించి ఉచిత వసతి ఏర్పరచి, వాళ్ళద్వారా నిర్ణయం చేయించారు.

ఇవన్నీ చూసి ఈ పద్ధతులు అనుసరించడం, వసతులు వాడుకోవడం చేతగాక తికమక పడుతున్న బి. సి. పౌరుడొకడు ఎటూ తేల్చుకోలేక ఇంట్లోనే ఉండిపోయాడు. అవతల పోలింగుకు వేళ పూర్తికావచ్చింది. ఊళ్ళో పిల్లామేకా అంతా ఓట్లు వేసేశారు. అప్పటికి తేలిన లెక్కలు చూడగానే అంతా హాహాకారాలు చేశారు. అభ్యర్థులిద్దరికీ చెరిసమంగా పడ్డాయి ఓట్లు. ఎవరు గెలిచినట్లు? ఎవరికీ ఏమీ పాలుపోలేదు. ఇంత ప్రయాసా, ఇన్ని లక్షల ఖర్చూ దండగ అయిపోతుంది. ఓటువేసిన వారెవరైనా ఉపసంహరించుకొంటే బాగుండునని తోచింది. ఇంకోగంట టైముందనగా

తిరిగి ప్రచారం సాగింది. ఉధృతంగా, ఈ సారి మీఓటు నాకు వెయ్యండి, నేను మీకు ఫలానాపన్లు చేసి పెడతాను, విదేశాంగ శాఖలో ఉద్యోగం వేయిస్తాను. అందులో మీకు గిట్టనివాళ్ళుంటే వాళ్ళను బర్తరఫ్ చేయిస్తాను. నా ప్రత్యర్థికింత ప్రజ్ఞలేదు అనే ప్రచారం బదులు కొత్త నినాదం ఆరంభమైంది. వాడికేసిన ఓటు లాగేనుకోండి. తూనాబొట్టు అనండి. మీలో ఏ ఒకరైనా మీది లొసుగు ఓటు అని ప్రకటించండి. నిన్న రాత్రి మూడు ఖూనీలు చేశాననండి. చెప్పరాని పార్టీ మనిషి ననండి. విదేశవాళీ గూఢ చారి ననండి. మీరు ఓటేసిన వ్యక్తి ఎంత దుర్మార్గుడో మీకు బొత్తిగా తెలీదు. వాడింట్లో పెద్ద కుక్క వుంది. మీరు అక్కడికెళ్తే కరుస్తుంది... ఆః మా కుక్కా? మా కుక్కను ఇంకో గంటలో చంపేస్తానుగా! పళ్ళు పీకించేస్తాను... అసలు మీరు ఓటేసినవాడివి కట్టుడు పళ్ళు మీకు తెలుసో తెలీదో. అంతెందుకూ వాళ్ళింట్లోకెళ్ళి ఆ పుస్తకాలు ఓసారి చూస్తేసరి - వాడికి ఓటు వేయడం ఎంత పొరబాటో, ఎంత దేశద్రోహమో మీకే తెలుస్తుంది. అసలు వాడి ఆస్తెంత. అన్నీ కలిపి పాతిక కార్లు లేవు. వంద మేడలు లేవు. లక్ష ఎకరాలమించి భూమిలేదు. అంతాహంగు బోలెడున్నట్లు. అంచేత ఎలాగైనా వాడికి మీరు వేసిన ఓటు ఉపసంహరించుకోండి... అంటూ శతకోటి విధాల ప్రచారం చేశారు. పోలింగుకు యింకో పది నిమిషాలు టైముందనగా హఠాత్తుగా తెలిసింది - ఒక దౌర్భాగ్యుడు మూర్ఖుడు లేదా ఒక జీనియస్, ఒక దేశ రక్షకుడు ఒక మహా పౌరుడు ఇంతవరకూ ఓటు వెయ్యలేదని తెలిసింది. అతను ఎటూ తేల్చుకో లేక గోళ్ళు తినేస్తున్నాడనీ ఇంకాసేపుంటే వేళ్ళు తినేస్తాడనీ ఆనక ఓటు కాయితం పట్టుకుందుకు వేళ్ళుండవనీ త్వరగావెళ్ళి వాణ్ణి కేకేసుకొచ్చి ఓటు వేయించాలని అన్నారు. అయితే కాసేపు ఆగుదాం. "మొండిచేతులతో ఓటు వేసిన పౌరుడు" అని డ్రామెటిక్‌గా ఫోటోలు తియ్యొచ్చు అన్నారు పత్రికలఫోటోగ్రాఫర్లు. ఎడిటర్లు వాళ్ళను బలపరచి సంపాదకీయాలు కూడా రాశారు. లివ్ సర్వీస్‌మన్ పుంజుకున్నాడు. ఈ ధోరణిని హేళనచేస్తూ బ్రిటన్ వ్యంగ్య వ్యాసాలు ప్రసారం చేసింది. ఆ క్రూర సమితి ఊరేగింపులు జరిపింది- ఆ వోటరుచేత గోళ్ళూ వేళ్ళూ తిననివ్వడం ఘోరమని పౌరహక్కుల సమితి మేలుకుని నిరసించింది... ప్రతివాడికీ తనగోళ్ళూ వేళ్ళూ కొరుక్కు తినేహక్కు ఉండాలనీ అది ఓటింగు మీద అతని అభిప్రాయం ప్రకటించడం కిందికి వస్తుంది కాబట్టి రాజ్యాంగరీత్యా అభిప్రాయస్వాతంత్ర్యం రక్షించాలని వాదించింది. గోళ్ళు— రాజ్యాంగం అనే

గ్రంథం త్వరలో ప్రకటిస్తున్నట్లు ప్రకటించింది. పాక్ అధ్యక్షుడు అమెరికా ఇండియాకు తోడ్పడరాదని తీవ్రంగా ప్రకటన చేశారు. రాజాజీ స్వతంత్రపార్టీ లక్ష్యాలను వివరించారు. ఈ లోపల ఎన్నికల అభ్యర్థులు, వారి మందీ మార్బలం ఆ ఓటరు ఆచూకీ కనుక్కొని వెళ్ళి అతన్ని మోసుకు వచ్చేశారు పోలింగ్‌బూత్ దగ్గరికి. 'వెయ్యి. ఓటు వెయ్యి' అన్నారు. ఇద్దరూ తుదిసారిగా చెరొక నిమిషం తమ శక్తిని, వాగ్ధాటిని, బుర్రను వాడేసి ఇరవై సెకండ్లలోనూ అరవై రోజుల ప్రచారసారం ఇమిడ్చి మాట్లాడారు - ఓటు ఎదటి వెధవగారికి ఎందుకు వెయ్యరాదో వివరిస్తూ, చివరికి ఉభయపక్షాల తరఫునా గొప్ప పదవులలో ఉన్న పెద్దనాయకు లిద్దరిచేతా ఇద్దరి కిద్దరూ ట్రంకు టెలిఫోన్లు తెప్పించి వాటిద్వారా ఓటరుకు చెప్పించారు.

ఓటరు బాలట్ కాగితం పట్టుకుని ఒకసారి కళ్ళు మూసుకున్నాడు నీరసంగా. తరువాత భోరున ఏడ్చాడు, చొక్కా తడిసిపోయేలా. ఉత్తర క్షణంలో ఆనందంతో నవ్వాడు. ఉత్సాహంగా లోపలికెళ్ళి ఇట్టే ఓటు వేసి చక్కా వచ్చాడు.

"సుబ్బరాజూ! ఆ వోటరు ముందర ఎందుకు ఏడిచాడు? తరువాత ఎందుకు నవ్వాడు? ఏమిటా కులుకు? ఎందుకా ఆనందం? చెప్పు చూతాం'' అన్నారు రెడ్డిగారు కథ ఆపి.

అసలు ఈ ఎన్నికలలో స్వతంత్రం అనేది చాలాకొద్ది. ఓటరు తనకు నిజంగా యోగ్యుడు అని తోచినవాడికి ఓటు వేసే అవకాశంలేదు. అంగబలం, అర్థబలం ఉండి పోటీకి నిలబడ్డ వారిలో మాత్రమే తనకు నచ్చినవాడిని ఎన్నుకోవచ్చు. ఎవడూ నచ్చకపోతే తన అభిప్రాయం చెప్పే అవకాశంలేదు. ఎందుకూ—

ఈఎన్నికలలో ఇద్దరూ మహాదుష్టులే. అయినా తాను ఓటు చేసి తీరాల్సిన దుర్గతి పట్టినందుకు అతను ఏడిచాడు. పోతే—

"ఇద్దరు వెధవల్లోనూ తన ఓటువల్ల ఎవరో ఒక్కడు మాత్రమే ఎన్నిక అవుతున్నాడుగదా అని ఆనందంతో ఉప్పొంగిపోయి పకాలున నవ్వాడు'' అన్నాడు సుబ్బరాజు.

"ఇంతకూ ఆ వోటరుమీదా, వాడి ఊహమీదా నీ అభిప్రాయం ఏమిటి!'' అన్నాడు రెడ్డిగారు, తువాలుతో ముఖం మీద పొయ్యనిచెమటా, పోసిన అభిప్రాయాలూ తుడిచేసుకుంటూ.

"వాడు వట్టి మూర్ఖుడు. బి. సి. మనిషి. ఇలాటివాణ్ని ఏ అండమాన్సో సైబీరియానో తోలెయ్యాలి" అన్నాడు రాజు.

———